
ఆలయంలో పుష్పాలంకరణ

నూకాంబిక అమ్మవారికి సారె ఊరేగింపు


రావికమతం మండలం కొత్తకోటలో నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం భక్తులు సారె, ఘటాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. - రావికమతం/ఆంధ్రజ్యోతి

జిల్లాకు చేరిన టెన్త్ పరీక్షల ప్రశ్నాపత్రాలు

- పోలీసు స్టేషన్లలో భద్రపరిచిన అధికారులు


పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నాపత్రాల బండిళ్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరాయి. సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వీటిని పరిశీలించిన అనంతరం స్టేషన్‌లోనే భద్ర పరిచారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఆయా రోజుల్లో పరీక్ష ప్రారంభం కావడానికి కొద్దిసమయం ముందు ప్రశ్నాపత్రాలను పోలీసు స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు తరలిస్తారు.

ఉపమాకలో పెళ్లి సందడి

నేడు వెంకన్న కల్యాణం

- కావడి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం
- పూలమాలలతో ఆలయం ముస్తాబు


ఉభయదేవేరులతో స్వామివారు

నక్కపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఆలయంలో వున్న స్వామివారికి ఉదయం ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాఢవీధుల్లో సంప్రదాయబద్ధంగా కావడి ఊరేగింపు చేపట్టారు. భక్తుల నుంచి కొబ్బరి బొండాలు, పసుపు, కుంకుమలను స్వీకరించారు. ఆదివారం రాత్రి 8 గంటలకు శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆలయంలో వున్న క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి అర్చకుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఉత్సవాల అంకురార్పణ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరుణ, కంకణధారణ, తీర్థగోష్ఠి నిర్వహించారు. రాత్రి 11 గంటలకు వాస్తు మండప పూజ, యోగీశ్వర మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, గరుడ ఆవాహనాలతో చతుస్థాన అర్చనలు చేశారు. సోమవారం కల్యాణోత్సవానికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.ఆలయాన్ని పూలమాలలతో అందంగా అలంకరించారు. తెల్లవారుజామున కొండపై వున్న స్వామి ... మిగతా 6వ పేజీలో

ప్రమాదాల రహితంగా పరిశ్రమలు

యాజమాన్యాలు, కార్మికులు, ప్రభుత్వ యంత్రాంగం ఉమ్మడిగా కృషి చేయాలి

- నెల రోజుల్లో వసుధామిశ్రా కమిటీ నివేదిక
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాశ్


ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాశ్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్/ కొత్తూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ప్రమాదాలను పూర్తిగా నివారించడానికి యాజమాన్యాలు, కార్మికులు, ప్రభుత్వ అధికారులు ఉమ్మడిగా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఇక్కడ ఎన్టీఆర్ స్టేడియం నుంచి రింగురోడ్డు వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో, మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కార్మికుల భద్రతకు ప్రభుత్వంతోపాటు యాజమాన్యాలు కూడా బాధ్యత తీసుకోవాలని, విధులు నిర్వహించే ప్రదేశంలో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో 884 పరిశ్రమలు ఉన్నాయని, వీటిలో ప్రమాదకరమైన కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలు 205 ఉన్నాయన్నారు. అన్నింటిలో కలిపి లక్షా 28 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. జిల్లాలో అధిక సంఖ్యలో పరిశ్రమలు వుండడం వల్ల ప్రమాదాలు కూడా అంతేస్థాయిలో జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ... మిగతా 6వ పేజీలో

నేడు వడ్డాదిలో స్వామివారి కల్యాణం


వడ్డాదిలో వేంకటేశ్వరస్వామి ఆలయం

బుచ్చెయ్యపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో గిరిజాంబ కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణమహోత్సవాలు ఆదివారం రాత్రి స్వామివారి దొంగపెళ్లితో ప్రారంభం అయ్యాయి. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రికి కల్యాణం జరుపుతారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. 12న తిరువీధి ఉత్సవం, 14న నాగవల్లి తిరువసంతోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తారు.

వృథాగా కుట్టు శిక్షణ కేంద్రం

నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ పాలకులు

- స్వయం ఉపాధి శిక్షణకు దూరమైన మహిళలు
- వినియోగంలోకి తేవాలని కూటమి ప్రభుత్వానికి వినతి


చోడవరంలో మూతపడిన కుట్టు శిక్షణ కేంద్రం

చోడవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): **స్థానిక వెలుగు కార్యాలయంలో కుట్టు శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారింది. వైసీపీ ఐదేళ్ల పాలనతో దీని గురించి పట్టించుకోకపోవడంతో మూతపడింది. వేలాది రూపాయల విలువైన కుట్టు మిషన్లు నిరుపయోగంగా ఉండిపోయాయి.**

మహిళలకు చోడవరంలోని వెలుగు శిక్షణ కేంద్రంలో ఆధునిక కుట్టు మిషన్లపై శిక్షణ ఇచ్చేవారు. శిక్షణ పొందిన అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసేవారు. దీంతో వారు స్వయం ఉపాధి పొందేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో మూతపడింది. ఐదేళ్లలో కనీసం ఒక్కసారి కూడా తలుపులు తెరిచిన పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం బదిలీపై వెళ్లిన వెలుగు పీడీ లక్ష్మీపతి.. ఈ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కుట్టు మిషన్లకు మరమ్మతులు చేయించి, కుట్టు శిక్షణను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే పీడీ ఆకస్మికంగా బదిలీ కావడంతో శిక్షణ కేంద్రం తెరుచుకోలేదు. కుట్టు మిషన్లకు నిర్వహణ పనులు చేయిస్తే తక్కువ ఖర్చుతో కేంద్రం ప్రారంభించడానికి అవకాశం ఉంది. తద్వారా డ్వాక్రా మహిళలు కుట్టు శిక్షణ పొందుతారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా పలుచోట్ల మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా చోడవరంలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.


నిరుపయోగంగా పడివున్న కుట్టు మిషన్లు

జీడిమామిడిపై టీ దోమ దాడి

అధిక మంచుతో విజృంభిస్తున్న తెగులు

- పిందెలపై పదుల సంఖ్యలో దోమలు
- రసం పీల్చడంతో మాడిపోతున్న పిందెలు
- దిగుబడిపై ఆందోళన చెందుతున్న రైతులు
- మందులు పిచికారీ చేయాలని కేవీకే శాస్త్రవేత్త సత్తిబాబు సలహా


బుడ్డిబందలో జీడిమామిడి పిందెలపై టీ దోమల గుంపు

రావికమతం మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు, మంచు ప్రభావంతో జీడిమామిడి తోటలను తెగుళ్ల ఆశిస్తున్నాయి. ప్రధానంగా తేయాకు దోమలు దాడి చేస్తున్నాయి. పిందెలపై పదుల సంఖ్యలో ఈ దోమలు చేరి, రసం పీల్చేయడంతో నల్లగా బొగ్గుల్లా మారిపోయి రాలిపోతున్నాయి. ఈ తరహా తెగులు జిల్లాలోని అన్ని మండలాల్లో వుందని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు చెప్పారు. రైతులు జీడిమామిడి తోటలను రోజూ నిశితంగా పరిశీలిస్తూ, తెగుళ్ల లక్షణాలు కనిపిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సుమారు లక్ష ఎకరాల్లో జీడిమామిడి తోటలు సాగులో వున్నాయి. వరి, చెరకు తరువాత ఎక్కువ మంది రైతులు ఆధారపడినది జీడిమామిడే. గత ఏడాది ... మిగతా 6వ పేజీలో


కామిరలో టీ దోమ ఆశించడంతో మాడిపోయిన జీడిమామిడి పూత

పెట్టుబడి వస్తుందన్న నమ్మకం లేదు



సముద్రంలో చేపల వేట సరిగా సాగక, యర్రబంద వచ్చి ఐదు ఎకరాల జీడిమామిడి తోటలను మూడేళ్లపాటు రూ.3.9 లక్షలకు కౌలుకు తీసుకున్నాను. గత మూడేళ్ల ఆశించినంత దిగుబడి రాకపోవడంతో నష్టం వచ్చింది. అప్పుచేసి కౌలు సొమ్ము చెల్లించాను. దీంతో భూమి యజమాని నాపై దయతలచి ఈ ఏడాది ఉచితంగా సాగు చేసుకోమని చెప్పారు. తోటల్లో అంతర కృషి, ఎండు కొమ్మల కత్తిరింపు, ఎరువులు, పురుగు మందుల కోసం లక్ష రూపాయలకుపైనే ఖర్చులు అయ్యాయి. టీ దోమ ఆశించడంతో పెట్టుబడి వస్తుందన్న నమ్మకం కూడా లేకపోయింది.

దేముడు, కౌలురైతు, ముత్యాలమ్మపాలెం, పరవాడ మండలం

చెరువులో ఒకరి గల్లంతు

- చేపల వేటకు నీటిలో దిగడంతో ఘటన


సూరలక్ష్మీనారాయణ (ఫైల్ ఫొటో)

పరవాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణికం పెద చెరువులో ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. చేపలు పట్టేందుకు చెరువులో దిగగా.. ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపిన ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.10
సహరి (మంగళ)	4.54

బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ సమ్మేళనం


బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ భిక్షువులు, బౌద్ధ సంఘాల ప్రతినిధులు


తుమ్మపాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరం గ్రామానికి సమీపంలో వున్న ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద ఆదివారం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బౌద్ధ సమ్మేళనం జరిగింది.

ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి బౌద్ధ సంఘాల ప్రతినిధు లు, బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ భిక్షువులు హాజరయ్యారు. గౌతమ బుద్ధుడు సామాజిక ఉద్య మకారుడని,అహింసా మార్గాన్ని బోధించి ప్రపంచాన్ని శాంతి పథంలో నడిపించిన గొప్ప వ్యక్తి అని వక్తలు కొనియాడారు. అంతకు శాంతి ర్యాలీ నిర్వహించి కొండపై వున్న ప్రధాన స్థూపం వద్ద, గుహ లోపల ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల ప్రతినిధులు మాటూరి శ్రీనివాసరావు, వల్ల బాబ్జీ, కల్యాణరావు, వేణుగోపాల్, నవీన్, బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు ముహూర్తం ఖరారు

- మే 11, 12, 13 తేదీల్లో నిర్వహణ


పాడేరు మోదకొండమ్మ

పాడేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలను ఈ ఏడాది మే నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రకటించారు. ప్రతి ఏడాది మే నెలలో మోదకొండమ్మ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఉత్సవాల తేదీల ఖరారు కోసం ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ విశ్వేశ్వరరాజు, ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఇతర వర్గాల వారితో సమావేశం నిర్వహించారు. ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యం నిర్ణయించిన ముహూర్తం మేరకు మే నెల 11, 12, 13 తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తామని చైర్మన్ ప్రకటించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



గణేష్(ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం తోటపాలెంకి చెందిన గణేష్ (22) స్నేహితుడు సాయి హర్షవర్ధన్ అచ్యుతాపురం సెజ్‌లోని ఒక కర్మాగారంలో పనిచేస్తున్నాడు. తనతో పాటు తన స్నేహితుడు జస్వంత్‌కి కూడా అక్కడ ఏదైనా ఉపాధి చూడమని గణేష్ కోరాడు. ఇక్కడకి వస్తే ప్రయత్నిస్తానని చెప్పడంతో గణేష్, జస్వంత్ కలిసి అచ్యుతాపురం వచ్చారు. ముగ్గురు కలిసి అచ్యుతాపురంలో సాయి హర్షవర్ధన్ ఉంటున్న అద్దె ఇంట్లో ఉన్నారు. శనివారం రాత్రి గణేష్ మేడ మీద ఫోన్‌లో మాట్లాడుతుండగా పక్కనే మేడను అనుకొని ఉన్న విద్యుత్ వైర్లకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

హోం మంత్రికి యోగా టీచర్ల వినతి

నక్కపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ శాఖలో గత మూడేళ్ల నుంచి పనిచేస్తున్న యోగా శిక్షకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనివేళలు కూడా పెంచాలని ఏపీ ఆయుష్ యోగా ఇనస్ట్రక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రాత్రి హోం మంత్రి అనితను కోరారు. ఈ మేరకు వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా ఇనస్ట్రక్టరు డి. రాంబాబు నేతృత్వంలో పలువురు హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేశారు. పరీక్షల్లో ఒత్తిడికి గురైన ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఆత్మన్యూనతకు గురికాకుండా వుండాలంటే వారికి యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం ఎంతో అవసరమని వారు వివరించారు. తమ సేవలను వినియోగించుకోవడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ అంశాన్ని సంబంధిత శాఖ మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళతానని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ యూనియన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరించిన మంత్రి అనిత

పాయకరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీని రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి వి.అనిత పాయకరావుపేట మండల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కేఎస్.గాంధీ, వై.ఆనందరావు సమక్షంలో సంఘం డైరీ, క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంటి, వరప్రసాద్, కట్టా శ్రీను, నాగేశ్వరరావు, సంజీవ్, నాగరాజు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ



నక్కపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 9.30 గంటలకు స్వామివారి తొలి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. అశ్వవాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తుల ను అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. అనేక మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉపమాక క్షేత్రం విద్యుత్‌కాంతులతో శోభాయమానంగా కనబడుతోంది.

ఉపమాకలో శ్రీవారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భక్తులను ఇబ్బంది పెట్టొద్దు : డీఎస్పీ



బందోబస్తు నిర్వహించే పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు

నక్కపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలు సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచి బందోబస్తు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా వుండాలని, భక్తులను ఇబ్బంది పెట్టకుండా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం రాత్రి ఉపమాక ఆలయం వద్ద బందోబస్తుకు నియమితులైన సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ ఏ వాహనాలను ఉపమాక గ్రామంలోకి అనుమతించకూడదన్నారు. కేవలం పాస్‌లున్న వాహనాలనే అనుమతించాలన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐలు కుమారస్వామి, అప్పన్న, రామకృష్ణ, ఎస్‌ఐలు సన్నిబాబు, విభీషణరావు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల ఏర్పాట్లు మంత్రి అనిత పరిశీలన



ప్రధానార్చకుడితో మాట్లాడుతున్న మంత్రి అనిత

నక్కపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో సోమవారం రాత్రి జరగనున్న స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం హోం మంత్రి అనిత పరిశీలించారు. ఆలయ పరిసరాలు, గ్రామాల్లో శానిటేషన్ పనులు బాగా చేపట్టారని ఎంపీడీవో సీతారామరాజును అభినందించారు. సోమవారం ఉదయం నుంచి క్యూ లైన్లలో వున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా మంచినీరు, మజ్జిగ సరఫరా చేయాలని టీడీపీ నాయకులు వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జికి ఆమె సూచించారు. ఆమె వెంట ఆలయ మాజీ చైర్మన్లు కొప్పిశెట్టి కొండబాబు, పెంకులరాజు, ఆకేటి గోవిందరావు, టీడీపీ నాయకులు కురందాసు నూకరాజు, లక్ష్మణరావు, జగదీశ్వరరావు, సర్పంచ్ వీరబాబు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు విజయ హోమం



విజయ హోమంలో పాల్గొన్న ఏడు మండలాల టెన్త్ విద్యార్థులు

రాంబిల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుతూ భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ఆధ్వర్యంలో పంచదార్లలోని ద్విముఖ వినాయకుని ఆలయంలో ఆదివారం విజయ హోమాన్ని నిర్వహించారు. విద్యార్థులందరితో అర్చకులు యూవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, బి.లక్ష్మీనారాయణ శర్మ, బీవీ.రమణమూర్తి వినాయకునికి పూజ, హోమం చేయించి, ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పూజ చేసిన పెన్, విభూది, విజయకంకణం, అక్షింతలు, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.కార్యక్రమంలో బీసీటీ మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ మురళీమోహన్‌నాయుడు, రాంబిల్లి, అచ్యుతాపురం,ఎలమంచిలి, మునగపాక, ఎస్.రాయవరం, కశింకోట, పరవాడ మండలాల్లోని 27 హైస్కూళ్లకు చెందిన 518 మంది విద్యార్థులు, బీసీటీ కార్యకర్తలు ఎస్‌వీ.రమణ, ఎస్.నాగేశ్వరరావు, పీఏ.నాయుడు, బీసీటీ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగు నీటికి అధిక ప్రాధాన్యం : సుందరపు



ఆర్‌ఓ ప్లాంట్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగు నీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం మడుతూరులో కొత్తగా ఏర్పాటుచేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మడుతూరు ప్రజల ఇబ్బందులను తొలగించడానికి భార్గవి అమోనియా యాజమాన్యం ఇక్కడ ఆర్వో ప్లాంగ్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో కర్మాగారం ఎండీ ఎం. కొండలరావు, మోటూరు శ్రీవేణి, రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, కరెడ్ల సూర్యప్రకాష్, శనివాడ ఆనంద రావు, ద్వారపురెడ్డి బాపు, మోటూరు త్రినాథస్వామి తదతరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

రాంబిల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ సభను పండుగ వాతావరణంలో జరగబోతుందన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లుచేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బి.శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర పాల్గొన్నారు.

సీతారాముల రథం పునఃనిర్మాణ పనులకు శ్రీకారం

మునగపాక, మార్చి 9 (ఆంధ్రజోతి): మునగపాక రామాలయం ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు రథం పునః నిర్మాణ పనులకు ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రథంలో ప్రధాన భాగం చెక్కకు భక్తులు పసుపురాసి, బొట్లు పెట్టారు. కార్యక్రమంలో అర్చకులు రేజేటి వెంకటరామ వరహా నరసింహాచార్యులు, వెంకట సత్యనారాయణాచార్యులు, నేతలు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఆడారి లక్ష్మణరావు, పొలిమేర కృష్ణ, సూరిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠ



ఎలమంచిలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని తెరువుపల్లిలో ఆదివారం వేలాది మంది భక్తుల సమక్షంలో గ్రామదేవత నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈనెల 7వ తేదీ నుంచి శాస్త్రోక్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం ఉదయం 10.48 గంటలకు యంత్ర స్థాపన, గోదర్శనం, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా ఎంపీపీ బొదెపు గోవింద్, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు జయరామ్, పిల్లా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో వెంకన్న కల్యాణోత్సవాలు

మునగపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల పదో తేదీన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. అందులో భాగంగా వాడ్రాపల్లి, చూచుకొండ, నాగులాపల్లి తదితర గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలను ముస్తాబు అయ్యాయి. వాడ్రాపల్లి కొండపై కొలువైన కమల వైభోగ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని 1946లో నిర్మించారు. ఆలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి పాలరాతి విగ్రహాన్ని బర్మాలో తయారు చేయించి, ఇక్కడ ఆవిష్కరించారని ట్రస్టీ పిల్లి సూర్యనారాయణ చెప్పారు. కల్యాణ ఉత్సవాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

పాయకరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక దుర్గానగర్‌లో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడి ఉపాధి అవకాశాల మెరుగుపర్చుకోవడానికి ప్రభుత్వం శిక్షణ అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాకలపాటి రవిరాజు, టీడీపీ నాయకులు జానకి శ్రీను, యాళ్ల వరహాలబాబు, బొంది కాశీవిశ్వనాథం, మజ్జూరి నారాయణరావు, చిక్కాల శ్రీను, ఎం.రమాకుమారి, పల్లా విలియంకేరి, జనసేన నాయకుడు ఆచంట దొర, బీజేపీ నాయకుడు కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన రాజీవ్‌గాంధీ విగ్రహం



రాజీవ్‌గాంధీ విగ్రహం శిథిలమైన దృశ్యం

పాయకరావుపేట రూరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరంలో దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహం పూర్తిగా శిథిలమైంది. రాజీవ్‌గాంధీ విగ్రహం రెండు చేతులు, కాలు విరిగిపోయి, ముఖం ముక్కలు అయ్యాయి. దేశ ప్రధానికి ఇచ్చే గౌరవం ఇదేనా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ గాంధీ జయంతికి, వర్ధంతికి హడావిడి చేసి పూలమాలలు వేసి నివాళులర్పించి, స్వీట్లు పంపిణీ చేసే నాయకులు కనీసం విగ్రహం శిథిలమైనా పట్టించుకోవట్లేదని వారు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, లేకుంటే పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

అచ్యుతాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అదిస్తాన్ (బ్రాండిక్స్) ఆదివారం నిర్వహించిన 136వ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి 650 మంది రోగులు హాజరుకాగా 395 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 312 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా 123 మందికి మందులు అందజేశారు. అలాగే 50 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరికి విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని అదిస్తాన్ కర్మాగారం ప్రతినిధులు తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికీ మంచినీరు, మజ్జిగ, పులిహోరతోపాటు ఉచితంగా భోజనాలు కూడా ఏర్పాటుచేశారు.

'ఏకాగ్రత విజయానికి ప్రధాన ఆయుధం'

మునగపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రత విజయానికి ప్రధాన ఆయుధం వంటిదని ప్రముఖ విద్యా సైకాలజిస్ట్ జేఎస్‌వీ.రావు తెలిపారు. మండలంలో తిమ్మరాజుపేట జడ్పీ స్కూళ్లో ఆదివారం తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (తోసా) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ భయం, ఒత్తిడి ఫలితాలపై ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమాశంకర్, తోసా నిర్వాహకుడు కాండ్రేగుల వెంకటఅప్పారావు, హెచ్ఎం అప్పారావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాంబిల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలజంపలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రం, శారదా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఏడు విభాగాలకు చెందిన వైద్యనిపుణులు డాక్టర్ పి.రామారావు, డాక్టర్ వైఎల్ నర్సింగరావు, జి.భాగ్యరాజు, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ జోష్వా, డాక్టర్ ఎంఎస్ఎల్ రాజు, డాక్టర్ నాగలక్ష్మి 200 మందికి పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడుజి.దేముడునాయుడు, ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, గ్రామ పెద్దలు ఉరుకోటి అప్పారావు, వి.వెంకునాయుడు, వేగి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం ప్రారంభం

రాంబిల్లి, మార్చి 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలో గోవిందపాలెంలో రామాలయాన్ని ఆది వారం ఘనంగా ప్రారంభించారు. వేకువ జాము నుంచి రామాలయం ఆవరణలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. శుభముహూర్తాన వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం సీతారాములకు కల్యాణాన్ని నిర్వహించారు. రాష్ట్రరహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సీతారాములవారిని దర్శించారు. ఈసందర్భంగా ప్రగడను సన్మానించారు.

కాంపాక్టర్ వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న సుందరపు

ఎలమంచిలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలి మునిసిపాలిటీలో చెత్త తరలించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అందజేసిన కాంపాక్టర్ వాహనాన్ని ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి ప్రారంభించారు. ఐఓసీ రూ.29 లక్షలతో కొనుగోలు చేసి అందించిన ఈ వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, అధికారులుపాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రిని కలిసిన కూటమి శ్రేణులు

మునగపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కూటమి శ్రేణులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో సమక్షంలో మంత్రిని కూటమి నాయకులు దొడ్డి శ్రీను, టెక్కలి పరశురాం, జేకే నాయుడు, శరగడం యోగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నక్కపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన ఐదు కుటుంబాల వారికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ 3 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం రాత్రి హోం మంత్రి అనిత తన నివాసంలో పంపిణీ చేశారు. యల్లపు పార్వతికి రూ. 65,783, నాగరత్నంకు రూ.79,995, గెడ్డమూరి మాణిక్యంకు రూ.ఒక లక్ష, చింతల పోలమ్మకు రూ.51,309, వంగలపూడి సూర్యలక్ష్మికి రూ.23,920 చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో అమలకంటి అబద్దం, పెద్దిరెడ్డి చిట్టిబాబు, వంగలపూడి గోవింద్,పెదిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో పెళ్లి సందడి



ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకస్వాములు

... 5వ పేజీ తరువాయి

నిజరూపానికి పంచామృతాభిషేకం చేసిన తరువాత భక్తులకు దర్శనాలు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ధ్వజారోహణం జరుగుతుంది. రాత్రికి ఉపమాకలోని సింహాద్రి మాస్టారు ఇంటి వద్ద ఎదురుసన్నాహ మహోత్సవం నిర్వహిస్తారు. ప్రముఖ పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి ఈ ఘట్టాన్ని వర్ణిస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు రథోత్సవం మొదలవుతుంది. రాత్రి ఒంటి గంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి కల్యాణం జరుగుతుంది. ఆలయ ప్రధాన రాజగోపురం పక్కన కల్యాణ వేదికను ముస్తాబు చేశారు. స్వామివారికి హోం మంత్రి వంగలపూడి అనిత పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

జీడిమామిడిపై టీ దోమ దాడి

... 5వ పేజీ తరువాయి

డిసెంబరులో కూడా వర్షాలు పడడంతో జీడిమామిడి తోటల్లో ఆశాజనకంగా పూత పూసింది. అయితే పిందెగా మారే తరుణంలో మంచు ప్రభావం అధికంగా వుండడంతో చాలా వరకు పూత మాడిపోయింది. దీంతో పిందెలు తక్కువ ఏర్పడ్డాయి. ఈ తరుణంలో కొద్ది రోజుల నుంచి పగలు అధిక ఎండ, రాత్రిపూట చలి, తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు మంచు కురుస్తుండడంతో తేయాకు దోమ విజృంభించింది. జీడి పిక్కలపై పదుల సంఖ్యలో చేరి, రసాన్ని పీల్చివేస్తున్నాయి. దీంతో పిక్కలు గిడసబారిపోయి నల్లటి బొగ్గుల్లా మారిపోతున్నాయి. వీటిని పట్టుకుంటే చేతులకు కాటుక మాదిరిగా నల్లటి పొడి అవుతున్నది. మందులు పిచికారీ చేస్తున్నప్పటికీ టీ దోమ పూర్తిగా తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. కాగా జీడిమామిడి తోటలకు ఆశించిన తెగుళ్లు, రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. ఆయన పలు సూచనలు చేశారు. "శీతాకాలం పోయి వేసవి కాలం వచ్చిన తరుణంలో వాతావరణం ఏర్పడిన మార్పుల కారణంగా జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాల్లో జీడిమామిడి తోటల్లో తేయాకు దోమ ఉధృతంగా ఉంది. వీటి నివారణకు లామ్డా సైలోత్రిన్ మందును లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున 200 ఎం.ఎల్., కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును లీటర్ నీటికి మూడు గ్రాముల చొప్పున 600 గ్రాములు వేర్వేరుగా కలుపుకోవాలి. అనంతరం ట్యాంకులో ఈ రెండు మందుల నీటిని పోసి పూత, పిందె, ఆకులు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. తోటల్లో వున్న చెట్లనుబట్టి మందు మోతాదును పెంచుకోవడం, లేదా తగ్గించుకోవడం చేయాలి" అని సూచించారు.

దిగుబడిపై సన్నగిల్లిన ఆశలు

బండి గంగరాజు, కౌలురైతు, కేఎంపురం



నాలుగు ఎకరాల జీడి మామిడి తోటను మూడేళ్ల పాటు రూ.2.5 లక్షలకు కౌలుకు తీసుకున్నాను. రెండేళ్ల నుంచి జీడి పిక్కల దిగుబడి ఆశాజనకంగా లేదు. వచ్చే ఆదాయం.. పెట్టుబడి, కౌలుకు సరిపో తున్నది. ఈ ఏడాది పూత అధికంగా రావడంతో కాపు బాగుంటుందని ఆశించాను. అయితే మంచు ప్రభావం అధికంగా వుండడంతో పూత మాడిపోయింది. పిందెలు వస్తున్న తరుణంలో తేయాకు దోమ ఆశించింది. దిగుబడి ఎంత వస్తుందో చెప్పలేని పరిస్థితి వుంది.

ఎలమంచిలిలో హిందూ సంఘాల ర్యాలీ



ఎలమంచిలిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చంపాజీ మహరాజ్ జీవిత చరిత్రను తెలుపుతూ నిర్మించిన చావా చిత్రం విడుదల సందర్భంగా పట్టణంలో ఆదివారం హిందూ సంఘాల ర్యాలీని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ప్రారంభించారు. ఈ ర్యాలీ సీతాచిత్రమందిర్ వరకూ తరలివెళ్లారు. ఈ సినిమా మార్నింగ్ షోను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ఉచితంగా వేయించారు. దీంతో అధిక సంఖ్యలో ఈ చిత్రాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. పరమేశ్వరావు, స్థానిక నేతలు పప్పు ఈశ్వరరావు, పిట్టా దాసుబాబు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులో ఒకరి గల్లంతు

... 5వ పేజీ తరువాయి

వివరాలిలా ఉన్నాయి. భరణికం గ్రామానికి చెందిన బలిరెడ్డి సూర్యలక్ష్మీనారాయణ (30) అవివాహితుడు. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పెదచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. సూర్యలక్ష్మీనారాయణ, మరో ఇద్దరు ఒక వైపు, మిగిలిన ముగ్గురు మరోవైపు చెరువులో దిగారు. ఈ క్రమంలో సూర్యలక్ష్మీనారాయణ నీటిలో మునిగిపోయాడు. మిగిలిన వారు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐలు బి.కృష్ణారావు, మహలక్ష్మి సిబ్బందితో చెరువు వద్దకు వచ్చి పరిశీలించారు. మత్స్యకారులను రప్పించి ఫైబర్ బోటు సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపతుందని పోలీసులు తెలిపారు.

ప్రమాదాల రహితంగా పరిశ్రమలు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వ అలసత్వం కారణంగా పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం గురించి వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. యాజమాన్యాలు, కార్మికులు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి జీరో యాక్సిడెంట్స్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని కోరారు. పరిశ్రమల్లో ప్రమాదాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వసుధామిశ్రా నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిటీని వేసిందని, నెల రోజుల్లో కమిటీ నివేదిక వస్తుందని, దీనిని అధ్యయనం చేసి పరిశ్రమల్లో తగిన భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సుభాశ్ చెప్పారు.

జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ, పరిశ్రమల్లో ప్రమాదాలపై కార్మికులకు మాక్‌డ్రిల్ నిర్వహించి తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ, కార్మిక శాఖ అధికారులు పరిశ్రమల్లో కార్మికులకు భద్రత, బీమా అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్మాగార శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌మూర్తి, కర్మాగార సంయుక్త ముఖ్య తనిఖీ అధికారి జె.శివశంకర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నాగరాజారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

'సంక్రాంతికి వస్తున్నాం' సూపర్ సక్సెస్

▸▸ చిత్ర అర్ధ శత దినోత్సవ వేడుకల్లో వక్తలు


థియేటర్ యాజమాన్యానికి షీల్డు బహూకరిస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : హీరో వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం అర్ధశత దినోత్సవ వేడుకలు ఆదివారం స్థానిక షిర్డీసాయి థియేటర్‌లో ఘనంగా జరిగాయి. పట్టణ వెంకటేష్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు పి.చందు మాట్లాడుతూ కేవలం రూ.40 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన చిత్రం రూ.మూడు వందల కోట్లుపైగా వసూళ్లు రాబట్టిందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర థియేటర్ యాజమాన్యానికి షీల్డు బహూకరించారు. అంతకుముందు థియేటర్ మేనేజర్ ప్రసాద్ చేతుల మీదుగా విజయోత్సవ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మళ్ల శ్రీను, జోగేంద్ర, రాజు, నాగేశ్వరరావు, రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వస్వామి ఆలయ ప్రారంభోత్సవం


స్వామి దర్శనానికి వచ్చిన గండి బాబ్జీకి జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

సబ్బవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వర ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా ఉమాదేవి, రామలింగేశ్వర, లక్ష్మీగణపతి, నందీశ్వర, చండీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. రేజేటి శ్రీరామాచార్యులు, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. స్వామివారిని ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గండి రవికుమార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ ఎంపీపీ గండి దేముడు, స్థానిక నాయకులు కోటాన అప్పారావు, బర్ల రమణ, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, ధనిమిరెడ్డి శ్రీను, కొల్లి కృష్ణ, గంగునాయుడు, గెద్దం రమేశ్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఆలయ కార్యవర్గ సభ్యులు

పరవాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి పంచాయతీ ఫార్మా పునరావాస కాలనీ వద్ద గల కొండపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. మూడేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది. అధ్యక్షుడిగా బుగిడి రామ గోవిందరావు, కార్యదర్శిగా లాలం అప్పలనాయుడు, కోశాధికారిగా పెత్సమట్ల లోవరాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గొర్లె కనకారావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, సీహెచ్.వి.సత్యనారాయణ, రేలంగి ధనరాజు, ఎంవీజీ రామశేఖర్, బొడ్డు అమరావతి, సాలాపు కేదారి కనక సంతోషిలను ఎన్నుకున్నారు. ఆలయ పురోభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

'కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడిని తరలించాలి'


తాడి గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

పరవాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామంలో ఆదివారం సీపీఎం నేతలు అధ్యయన యాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు రుత్తల శంకరరావు మాట్లాడుతూ తాడి ప్రజలు ఫార్మా కాలుష్యంతో అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాన్సర్, ఊపిరితిత్తులు, చర్మ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామం తరలింపునకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గ్రామంలో పర్యటిస్తారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కండేపల్లి అప్పలరాజు, లక్ష్మి, పార్వతి, అప్పలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

పంచకర్లను కలిసిన సింహాచలం దేవస్థానం ఈవో

సింహాచలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.సుబ్బారావు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానంలో చేపడుతున్న కార్యక్రమాలపై పంచకర్లతో ఈవో చర్చించారు. అనంతరం పంచకర్లకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

నూకాంబిక జాతరకు పక్కాగా ఏర్పాట్లు

▸▸ నెల రోజుల వేడుకల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తరాదు ▸▸ అధికారులకు ఎమ్మెల్యే కొణతాల ఆదేశం ▸▸ అమ్మవారికి పూజలు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో కొత్త అమావాస్య జాతరను పక్కాగా నిర్వహించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. రాష్ట్ర పండుగగా నూకాంబిక జాతర జరుగుతున్న సందర్భంగా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా కోలాహల వాతావరణంలో జాతరను జరిపించాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని, ప్రధాన కూడళ్లలో భారీ ఆర్చిలు ఏర్పాటు చేయాలని, నెల రోజుల ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఎన్.సుజాత ఎమ్మెల్యేను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సుభాశ్

ఇదిలావుంటే, నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖా మంత్రి వాసంశెట్టి సుభాశ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో సుజాత స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి వెంట గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఉన్నారు.


అమ్మవారి సన్నిధిలో మంత్రి సుభాశ్, కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర

సీఆర్‌పీలకు హెచ్‌ఆర్ పాలసీ తీసుకొస్తాం

▸▸ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు వెల్లడి

▸▸ అనకాపల్లిలో జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల స్థాయిలో కీలక విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ (సీఆర్‌పీ)లకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని సీఆర్‌పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఇక్కడ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీ సహా పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి.

ఎన్నికైన సంఘం సభ్యుల వివరాలివి

సంఘం జిల్లా గౌరవాధ్యక్షునిగా శ్యామ్ (రావికమతం), జిల్లా అధ్యక్షునిగా సబ్బవరపు శంకరరావు (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి (రోలుగుంట), కోశాధికారిగా మూర్తి (రాంబిల్లి), ఉపాధ్యక్షులుగా రామకృష్ణ (గొలుగొండ), కన్వీనర్‌గా రమణ (సబ్బవరం), కో-కన్వీనర్‌గా పి.గంగాధర్ (దేవరాపల్లి), మహిళా కార్యదర్శిగా పద్మజ (అనకాపల్లి), కమిటీ సభ్యులుగా సతీష్ (రోలుగుంట), శ్రీనివాసరెడ్డి (ఎలమంచిలి), శివప్రసాద్ (అచ్యుతాపురం), గోవింద్ (మునగపాక), టి.శ్రీనివాసరావు (బుచ్చెయ్యపేట), చిరంజీవి (ఎస్.రాయవరం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణం చేయించామన్నారు.


రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కశింకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం గ్రామ సమీపంలో గల జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మృతుని వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటుందని తెలియజేశారు. మృతదేహానికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలిసినా కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు 94407 96088, ఎస్‌ఐ కె.లక్ష్మణరావు 77806 20619 నంబర్లలో లేదా కశింకోట పోలీసు స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచి ఉంచామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వివాహిత అదృశ్యం పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యంపై శనివారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ డి.ఈశ్వరరావు ఆదివారం తెలిపిన వివరాలివి. గాజువాకలో భర్త లోకేశ్‌తో నివాసం ఉంటున్న కొయిలాడ దుర్గ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామభద్రపురం కాలనీలో ఉన్న తన అక్క త్రాసుల నాగమణి ఇంటికి ఈ నెల నాలుగో తేదీన వచ్చేసింది. ఏడో తేదీన తన కుమార్తెను అక్క ఇంటి వద్దే ఉంచి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురిపై కేసు


పట్టుబడిన పందెం రాయుళ్లు

పరవాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాడి గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా మూడు కోడిపుంజులతో పాటు రూ. 5,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ బి.కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ బి.వై.నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ సాయికుమార్, కానిస్టేబుల్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు

సబ్బవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకాపల్లిలో ఈనెల 13న ముత్యమాంబ అమ్మవారి అనుపోత్సవం జరగనున్న నేపథ్యంలో రావలమ్మపాలెంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, దేముడు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, గొంప రమణ, మేడపురెడ్డి జగన్నాథం తదితరులతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

వెదురుపర్తిలో 'విద్యార్థి మేలుకో'


విద్యార్థికి పండ్లను అందజేస్తున్న హెచ్‌ఎం

కశింకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తిలో 'విద్యార్థి మేలుకో' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందజేశారు. రాష్ట్ర విద్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రాండ్ టెస్టు మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం వాటిలో తప్పులను సరిదిద్దేందుకు పలు సూచనలు చేశారు.

చేనుల అగ్రహారం సత్తెమ్మ పండుగలో కొట్లాట

▸▸ నలుగురికి తీవ్ర గాయాలు ▸▸ ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్సలు

కొత్తూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొండుపాలెం పంచాయతీ చేనుల అగ్రహారంలో ఆదివారం సత్తెమ్మతల్లి ఘటాల ఊరేగింపులో ఫ్లెక్సీల విషయమై వైసీపీ, టీడీపీ, జనసేన నేతల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల ద్వారా తెలిసిన వివరాలివి. గ్రామానికి చెందిన వైసీపీ నేతలు జనసేన, టీడీపీ నాయకులమని ప్రచారం చేసేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటే జనసేన పార్టీ నేతలు అడ్డుకొని ఫ్లెక్సీలపై ముద్రించి ఉన్న నేతల ఫొటోలపై పసుపురంగు చల్లారు. దీంతో ఇరు పార్టీ మధ్య మాటా మాటా పెరిగి కొట్లాటకు దారి తీసినట్టు తెలిసింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.


ఫ్లెక్సీలో వైసీపీ నేతలు ఉన్న ఫొటోలకు పసుపు రంగు వేసిన దృశ్యం

దుర్గమాంబ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం



లంకెలపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణలో హోమాలతో పాటు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రముఖులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు సుందరపు అప్పారావు, యర్రా కోటేశ్వరరావు, దాసరి రామారావు, వెంకటరావు, కాశీరావు, శంకరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సుందరరావు, సునీత, జువ్వాలు, నూకేశ్వరరావు, చెలపరెడ్డి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బయ్యవరంలో కనక మహాలక్ష్మి తీర్థం

కశింకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం సోమవారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

దేశపాత్రునిపాలెంలో పోలమాంబ పండుగ రేపు



పరవాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : దేశపాత్రునిపాలెంలో పోలమాంబ అమ్మవారి పండుగ మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

విజయరామరాజుపేటలో శ్రీవారి కల్యాణోత్స శుభపత్రిక ఆవిష్కరణ


వేంకటేశ్వర స్వామి వేడుక పోస్టర్లు ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి విజయరామరాజుపేటలో సోమవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ పోస్టర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భీమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా శ్రీవారి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శిలపరశెట్టిబాబి, పలకా కాసులు, దొడ్డి రమణ, యల్లపు శ్రీనివాస్, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు


పొక్లెయిన్ ద్వారా రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 80వ వార్డు పరిధిలో ఎన్టీఆర్ నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ రోడ్డు సదుపాయం లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు పడేవారు. ఈ విషయం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డు నిర్మాణానికి కృషి చేశారని సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్‌ఎంకే జోగినాయుడు,వార్డు జనసేన నాయకుడు బుద్ధ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'రాయితీపై విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ'

సబ్బవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులకు యాభై శాతం రాయితీపై విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ (లోడ్ రెగ్యులరైజేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ ఆదివారం తెలిపారు. సాధారణంగా గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో వినియోగదారులు లైట్లు, ఫ్యాన్లు మొదలగు తక్కువ విద్యుత్ వినియోగించే గృహ ఉపకరణాలను లెక్కించి, అందుకు అనుగుణంగా రెండు లేదా మూడు కిలో వాట్లు విద్యుత్ వినియోగానికి అనుమతితో మీటర్లు పొందుతారన్నారు. ఆ తరువాత అవసరాల దృష్ట్యా ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ వంటి అధిక విద్యుత్ వినియోగించే విద్యుత్ ఉపకరణాలను వినియోగిస్తూ ఉంటారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించి అధికలోడు గమనిస్తే విద్యుత్ సర్వీసు మీటర్లపై కేసు నమోదు చేస్తూ ఉంటారన్నారు. వినియోగదారులకు అటువంటి సమస్య లేకుండా అదనపు లోడు క్రమబద్ధీకరణ కార్యక్రమం ఈ నెల ఒకటో తేదీ నుంచి చేపడుతున్నట్టు చెప్పారు. జూన్ నెలాఖరు వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణ కిలోవాట్‌కు రాయితీ పోగా రూ.1250 (అసలు ధర 2,250), రెండు కిలో వాట్లకు రూ.2,450 (4450), మూడు కిలో వాట్లకు రూ. 3,450 (6650), నాలుగు కిలోవాట్లుకు రూ.4,850 (8850), ఐదు కిలో వాట్లకు రూ. 6,050(11,050) చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. సమీపంలోని మీ- సేవా కేంద్రాల్లో లేదా ఏపీఈపీడీసీఎల్ వెబ్ సైట్లో లేదా, గ్రామ సచివాలయం ద్వారా కానీ దరఖాస్తు చేసుకొని అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని సూచించారు. సందేహాల నివృత్తికి 1912కు కాల్ చేయవచ్చునన్నారు.


దెబ్బతిన్న స్తంభం అడుగు భాగం

పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో

పొంచి ఉన్న ప్రమాదం

▸▸ కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం

పరవాడ, మార్చి 9 ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం భయపెడుతోంది. అడుగుభాగం పాడవ్వడంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. పెద్ద ఎత్తున గాలులు వీచే సమయాల్లో, వర్షాలు కురిసేటప్పుడు మరింత ఆందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాత స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా అంతా కోరుతున్నారు.


కొర్రా గ్రామస్థులకు ఈ ఊట నీరే ఆధారం


నీటిని సేకరిస్తున్న మహిళలు

ఊట జలాలే దిక్కు

» కోర్రాలో తాగునీటికి అగచాట్లు..మూలకు చేరిన బోర్లు
» బురదతో కూడిన నీటితో వ్యాధుల భయం

డుంబ్రిగుడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ గ్రావిటీ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయిలందిస్తున్నట్టు అధికార యంత్రాంగం చెబుతున్న మాటలకు భిన్నమైన పరిస్థితులు గ్రామాల్లో నెలకొన్నాయి. మండలంలో మారుమూల గ్రామాల్లో వేసవి ప్రారంభం కాకుండానే దాహం కేకలు వినిపిస్తున్నాయి. మండలంలోని కోర్రా పంచాయతీ కోర్రా గ్రామంలో ఈ దుస్థితి నెలకొంది. గ్రామంలో ఉన్న మూడు బోర్లతో రెండు మరమ్మతుకు గురయ్యాయి. ఉన్న ఒక్క బోరునుంచి వస్తున్న నీరు చాలక పోవడంతో కలుషిత ఊటనీరు సేకరించి గ్రామస్థులు తాగుతున్నారు. దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులకు, పంచాయతీ పాలకులకు పలు మార్లు ఫిర్యాదు చేసిన తాగునీటి కల్పనపై చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. గతంలో నీటి ఊట వద్దకుండీ నిర్మించాలని గ్రామ సభల్లో విన్నవించిన పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

వేసవి ముందే కుండికి మరమ్మతు చేపట్టి నీటి నిల్వ చేయాలని కోరుతున్నారు. అలాగే, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోర్లు వినియోగంలోకి తేవాలని అభ్యర్థిస్తున్నారు.

గ్రావిటీ ట్యాంక్‌కు రంధ్రాలు.. అందని తాగునీరు

» గొల్లపల్లి గ్రామంలో గిరిజనుల అవస్థలు

సీలేరు : జీకేవీధి మండలం ఏ ధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో గ్రావిటీ పథకం స్టోరేజీ ట్యాంక్‌కు రంధ్రాలు పడటం తో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు గ్రామంలో తాగునీటి అవసరాలకోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధి కారులు కొండలపైన ఉన్న ఊట గెడ్డ నుంచి గ్రావిటీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి గ్రామానికి మంచినీటి సరఫరా చేస్తున్నారు. అయితే , ఊటనీరు లభ్యమయ్యే ప్రాంతంలో నీటి స్టోరేజీ కోసం నిర్మించిన వాటర్ ట్యాంక్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అది రంధ్రాలు పడి నీరు వృథాగా పోతోంది. దీంతో గ్రామానికి పైప్‌లైన్ ద్వారా నీరు రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వేసవి ఆరంభంలోనే గ్రామంలోనే గ్రావిటీ పథకం మరమ్మతుకు గురికావడంతో తాగునీరు అందక సమస్య ఎదుర్కొంటున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి గ్రావిటీ స్టోరేజీ ట్యాంక్‌కు మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


స్టోరేజీ ట్యాంక్ నుంచి నీటి లీకేజీని పరిశీలిస్తున్న గ్రామస్థులు

అరకులోయ-కొత్తవలస జంక్షన్ రోడ్డు నిర్మాణం


పూర్తయిన సీసీ రోడ్డు

అరకులోయ,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గోతులతో అధ్వానంగా ఉన్న అరకులోయ నుంచి చొంపి- కొత్తవలస జంక్షన్ రోడ్డుకు ఎట్టకేలకు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మోక్షం లభించింది. అడుగడుగునాగోతులతో వాహనచోదకులకు తీ వ్ర ఇబ్బందులకు లోనయ్యారు. అయితే, ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ పథకం కిందరూ.2.09 కోట్ల సువిశాలమైన సీసీ రోడ్డు (డబుల్) ఈమార్గంలో నిర్మించారు. టీడబ్ల్యూ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో ఈ రెండ్రోజులక్రితమే పూర్తి చేశారు.ఈ రహదారిలో 400 మీటర్ల మేర డ్రైన్‌నిర్మించాల్సి ఉంది. త్వరలో డ్రైన్ కాంక్రీట్ పనులు చేపట్టనున్నట్లు ఇంజనీరింగ్ ఏఈఈ అభిషేక్ తెలిపారు. రోడ్డు నిర్మాణంతో సిరగాం, బస్కీ, చొంపి గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

చొంపి-కొత్తవలస జంక్షన్ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

అలాగే, చొంపి-కొత్తవలస జంక్షన్ నుంచికుడివైపునకు సిరగాం పంచాయతీ శివారున దిబ్బవలస వరకు, ఎడమవైపు చొంపి, చంపగుడ మీదుగా బస్కీ దేవరాపల్లి వరకు గల రోడ్లు శిథిలమయ్యాయి. అధికారులు ఈ రెండు రహదారులకు మరమ్మతులు చేపట్టాలని సిరగాం, చొంపి, బస్కీ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి గిరిజన ప్రాంత సమస్యలు


కేంద్ర గిరిజన సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయ్కేతో ఏబీవీపీ నేత మహేశ్ తదితరులు

పాడేరురూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 9వ తేదీన (ఆదివారం) జరిగిన వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్‌లో అల్లూరి జిల్లా ఏబీవీపీ నాయకుడు అల్లంగి మహేశ్ బాబు ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సమావేశంలో పాల్గొన్న కేంద్ర గిరిజన సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయ్కేకు వివరించారు. ఆ వివరాలను స్థానిక మహేశ్‌బాబు విలేకరులకు తెలిపారు. విశాఖ ఏజెన్సీలో గిరిజనులు సహజ వనరుల మధ్య జీవిస్తూ వారి ప్రత్యేక సాంస్కృతి, ఆచారాలు, భాషలను పోషించుకుంటున్నారని తెలిపారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా గ్రామాల్లో నేటికీ సౌకర్యాలు లేక, తాగునీటికి, రహదారులు, విద్యుత్ సదుపాయంలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వివరించారు. గత ప్రభుత్వాలు సమస్యలను పట్టించుకోకుండా గిరిజనుల హక్కులు, చట్టాలను కాలరాసినట్టు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇకనైనా 1/70 చట్టం, పెసా చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలోని కళాశాలలు, పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, ఉన్నతవిద్యను అభ్యసించే గిరిజనవిద్యార్థులకు ఐటీడీఏ ద్వారా రుణాలు మంజూరు చేసేలా చర్యలుతీసుకోవాలని కోరారు.అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు మహేశ్‌బాబు తెలిపారు.

ఉపమాకలో పెళ్లి సందడి


ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకస్వాములు

... 5వ పేజీ తరువాయి

నిజరూపానికిపంచామృతాభిషేకం చేసిన తరువాత భక్తులకు దర్శనాలు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ధ్వజారోహణం జరుగుతుంది. రాత్రికి ఉపమాకలోని సింహాద్రి మాస్టారు ఇంటి వద్ద ఎదురుసన్నాహ మహోత్సవం నిర్వహిస్తారు. ప్రముఖ పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి ఈ ఘట్టాన్ని వర్ణిస్తారు. అర్థరాత్రి 12 గంటలకు రథోత్సవం మొదలవుతుంది. రాత్రి ఒంటి గంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి కల్యాణం జరుగుతుంది. ఆలయ ప్రధాన రాజగోపురం పక్కన కల్యాణ వేదికను ముస్తాబు చేశారు. స్వామివారికి హోంమంత్రి వంగలపూడి అనిత పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

ప్రమాదాలరహితంగా పరిశ్రమలు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వ అలసత్వం కారణంగా పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం గురించి వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. యాజమాన్యాలు, కార్మికులు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి జీరో యాక్సిడెంట్స్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని కోరారు. పరిశ్రమల్లో ప్రమాదాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వసుధామిశ్రా నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిటీని వేసిందని, నెల రోజుల్లో కమిటీ నివేదిక వస్తుందని, దీనిని అధ్యయనం చేసి పరిశ్రమల్లో తగిన భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సుభాశ్ చెప్పారు.

జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ, పరిశ్రమల్లో ప్రమాదాలపై కార్మికులకు మాక్ డ్రిల్ నిర్వహించి తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ, కార్మిక శాఖ అధికారులు పరిశ్రమల్లో కార్మికులకు భద్రత, బీమా అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్మాగార శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌మూర్తి, కర్మాగార సంయుక్త ముఖ్య తనిఖీ అధికారి జె.శివశంకర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నాగరాజారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడిపై టీ దోమ దాడి


జీడిమామిడి చెట్లకు పురుగు నివారణ మందు పిచికారీ చేస్తున్న రైతు

... 5వ పేజీ తరువాయి

డిసెంబరులో కూడా వర్షాలు పడడంతో జీడిమామిడి తోటల్లో ఆశాజనకంగా పూత పూసింది. అయితే పిందెగా మారే తరుణంలో మంచు ప్రభావం అధికంగా వుండడంతో చాలా వరకు పూత మాడిపోయింది. దీంతో పిందెలు తక్కువ ఏర్పడ్డాయి. ఈ తరుణంలో కొద్ది రోజుల నుంచి పగలు అధిక ఎండ, రాత్రిపూట చలి, తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు మంచు కురుస్తుండడంతో తేయాకు దోమ విజృంభించింది. జీడి పిక్కలపై పదుల సంఖ్యలో చేరి, రసాన్ని పీల్చివేస్తున్నాయి. దీంతో పిక్కలు గిడసబారిపోయి నల్లటి బొగ్గుల్లా మారిపోతున్నాయి. వీటిని పట్టుకుంటే చేతులకు కాటుక మాదిరిగా నల్లటి పొడి అవుతున్నది. మందులు పిచికారీ చేస్తున్నప్పటికీ టీ దోమ పూర్తిగా తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. కాగా జీడిమామిడి తోటలకు ఆశించిన తెగుళ్లు, రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. ఆయన పలు సూచనలు చేశారు. "శీతాకాలం పోయి వేసవి కాలం వచ్చిన తరుణంలో వాతావరణం ఏర్పడిన మార్పుల కారణంగా జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాల్లో జీడిమామిడి తోటల్లో తేయాకు దోమ ఉధృతంగా ఉంది. వీటి నివారణకు లామ్డా సైలోత్రిన్ మందును లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున 200 ఎం.ఎల్., కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును లీటర్ నీటికి మూడు గ్రాముల చొప్పున 600 గ్రాములు వేర్వేరుగా కలుపుకోవాలి. అనంతరం ట్యాంకులో ఈ రెండు మందుల నీటిని పోసి పూత, పిందె, ఆకులు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. తోటల్లో వున్న చెట్లనుబట్టి మందు మోతాదును పెంచుకోవడం, లేదా తగ్గించుకోవడం చేయాలి" అని సూచించారు.

దిగుబడిపై సన్నగిల్లిన ఆశలు

-బండి గంగరాజు, కౌలురైతు, కేఎంపురం



నాలుగు ఎకరాల జీడిమామిడి తోటను మూడేళ్లపాటు రూ.2.5 లక్షలకు కౌలుకు తీసుకున్నాను. రెండేళ్ల నుంచి జీడి పిక్కల దిగుబడి ఆశాజనకంగా లేదు. వచ్చే ఆదాయం.. పెట్టుబడి, కౌలుకు సరిపోతున్నది. ఈ ఏడాది పూత అధికంగా రావడంతో కాపు బాగుంటుందని ఆశించాను. అయితే మంచు ప్రభావం అధికంగా వుండడంతో పూత మాడిపోయింది. పిందెలు వస్తున్న తరుణంలో తేయాకు దోమ ఆశించింది. దిగుబడి ఎంత వస్తుందో చెప్పలేని పరిస్థితి వుంది.

చెరువులో ఒకరి గల్లంతు

... 5వ పేజీ తరువాయి

వివరాలిలా ఉన్నాయి. భరణికం గ్రామానికి చెందిన బలిరెడ్డి సూర్యలక్ష్మీనారాయణ (30) అవివాహితుడు. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పెదచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. సూర్యలక్ష్మీనారాయణ, మరో ఇద్దరు ఒక వైపు, మిగిలిన ముగ్గురు మరోవైపు చెరువులో దిగారు. ఈ క్రమంలో సూర్యలక్ష్మీనారాయణ నీటిలో మునిగిపోయాడు. మిగిలిన వారు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐలు బి.కృష్ణారావు, మహలక్ష్మి సిబ్బందితో చెరువు వద్దకు వచ్చి పరిశీలించారు. మత్స్యకారులను రప్పించి ఫైబర్ బోటు సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపతుందని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ సేవల విస్తరణకు ప్రత్యేక చర్యలు

ఇంటర్వ్యూ..

» జిల్లా రవాణా అధికారి (ఆర్టీసీ)

టి.ఉమామహేశ్వరరెడ్డి


ఉమామహేశ్వరరెడ్డి

జిల్లా కేంద్రం పాడేరు నుంచి జిల్లాలో అన్ని ప్రాం తాలకు ఆర్టీసీ సేవలను విస్తరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు స్థానిక ఆర్టీసీ జిల్లా రవా ణా అధికారి టి.ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. గిరిజన ప్రాంతాలకు మరిన్ని సర్వీసులు నడిపేలాకృషి చేస్తామన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న: జిల్లా కేంద్రానికి ఇతర ప్రాంతాలనుంచి రవా ణా సేవలను ఎలా అనుసంధానిస్తారు?

జవాబు: జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న రంపచోడవరం, చింతూరు ప్రాంతాలకు చెందిన ప్రజలకు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు పా డేరు నుంచి భద్రాచలానికి నాలుగు సర్వీసులు నడుపుతు న్నాం. పాడేరులో ఉదయం 7.15 గంటలకు, సా యంత్రం 4.30కు బస్సులు బయలుదేరుతాయి. అ లాగే, భద్రాచలంలో ఉదయం 7.30కు, రాత్రి 8.30కు పాడేరుకు బస్సులు బయలుదేరుతాయి.

ప్రశ్న: జిల్లాలో చాలా ప్రాంతాలకు రవాణా సేవలు లేవని అంటున్నారు?

జవాబు: జిల్లాలో అనేక ప్రాంతాలకు రోడ్లు సదుపాయంలేక బస్సులు నడపలేకపోతున్నాం. కానీ, రోడ్డు మార్గం చక్కగా ఉన్న ప్రాంతాలకు బస్సులు వేసేందుకు సిద్ధంగానే ఉన్నాం. ప్రజల అవసరాల మేరకు అన్ని ప్రాంతాలకు రవాణా సేవలందిస్తాం.

ప్రశ్న: పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లేందుకుసాయంత్రం6 దాటితే బస్సులు ఉండడంలేదు?

జవాబు: ఈ సమస్యను తాము ఇప్పటికే గుర్తించాం. దీంతో సాయంత్రం వేళలో మైదాన ప్రాంతాలకు వెళ్లే వారికి సౌకర్యంగా ప్రతి రోజు సాయంత్రం 7.15 గంటలకు ఇక్కడ నుంచి అనకాపల్లికి కొత్త సర్వీసును నడుపుతున్నాం.

ప్రశ్న: అంతర్ జిల్లా సర్వీసుల మాటేమిటి?

జవాబు: ఇప్పటికే ఇక్కడి నుంచి రాజమండ్రి, కాకినాడకు బస్సు సర్వీసులు నడుపుతున్నాం. అలాగే జిల్లాకు చేరువగా ఉన్న విజయనగరం జిల్లా శృంగవరపుకోట, విజయనగరం ప్రాంతాలకు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారని గుర్తించాం. దీంతో చింతపల్లి నుంచి విజయనగరానికి కొత్త సర్వీసును నడుపుతున్నాం.రోజూ మధ్యాహ్నం 2 గంటలకు చింతపల్లిలో బయలుదేరి సాయంత్రం 4కు పాడేరు చేరుకునిఇక్కడి నుంచి విజయనగరం వెళ్తుంది. అలాగే, అదే బస్సు ఉదయం 5.15కు విజయనగరంలో బయలుదేరి తిరిగి 9.30కు పాడేరు చేరుకుంటుంది.

ప్రశ్న: పాడేరు డిపో నిర్వహణ ఎలా ఉం ది?

జవాబు: స్థానిక డిపోలో సిబ్బంది, కార్మికులు సం స్థను బలోపేతం చేసేందుకు సహకరిస్తున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు పాడేరు నుంచి మత్స్యగుండానికి 24 బస్సులను పథకం తిప్పాం. గతేడాది కంటే ఈసారి సుమారుగా రూ.50 వేలు అదనపు ఆదాయం రావడానికి సిబ్బంది, కార్మికుల కృషి కారణం. వారంతా కమిటీలుగా ఏర్పాటై ఎక్కడికక్కడ భక్తులను బస్సుల్లో ఎక్కించి సర్వీసు చేశారు. దీంతో ఎక్కువగా భక్తులకు రవాణా సేవలందించగలిగాం.

- పాడేరు/ఆంధ్రజ్యోతి

డ్రైవర్ల యూనియన్ ఎన్నిక

పెదబయలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డ్రైవర్ల యూనియన్ కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ఏవోబీ వంతెన వద్ద నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా గండేరు జీవన్‌కుమార్‌ను డ్రైవర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అమిడెల నాగేశ్వరరావు, కుర్తాడి వెంకట్, కార్యదర్శిగా వంతాల కిశోర్, ఉపకార్యదర్శులుగా సందడి కామేశ్వరరావు,కోడా సాయి, క్యాషియర్లుగా గబారి రాధాకృష్ణ, సర్వసిద్ధి రామారావులను ఎన్నుకున్నారు. కోశాధికారులుగా బురిడి లక్ష్మణ్, మోహన్,బాలరాజు,రాంబాబు,ప్రసాద్‌లను నియమించారు.అలాగే సోషల్ మీడియా ఆర్గనైజర్‌గా ప్రశాంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

పేదలకు గృహాలు మంజూరు చేయాలి


నడిమివీధి ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నేత అప్పలనర్స

పాడేరురూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనులు గృహనిర్మాణాలకు స్థలాలను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య అధ్యయన యాత్రను ఆదివారం మండలంలోని చింతలవీధి పంచాయతీ నడిమివీధి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించేందుకు ప్రజా చైతన్య అధ్యయన యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు ప్రభుత్వం స్థలాలతోపాటు గృహాలను మంజూరు చేయాలని కోరారు. పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరు చేస్తున్న గృహాలకు యూనిట్ ధర రూ. 5 లక్షలకు పెంచాలన్నారు. తాగునీరు, పింఛన్ల సమస్య పరిష్కరించాలని కోరారు. చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాలని, చెరువుల్లో మట్టి పూడికలు తీయాలని ప్రజలనుంచి వినతులు వస్తున్నాయన్నారు. పీఎం కిసాన్ రాయితీ అందడం లేదని, ఉపాధి పనులు తక్షణమే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎల్.సుందరరావు, దాసు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కులపై చైతన్యం అవసరం


కుల్లుపాడు పాఠశాలలో మహిళలు

జి.మాడుగుల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మహిళలు తమ హక్కులపై చైతన్యంపొందడంతోపాటు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నేతలు కోరారు. గెమ్మెలిపంచాయతీ కుల్లుపాడు ఆశ్రమ పాఠశాలలో ఆదివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కరించుకుని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. మూఢనమ్మకాలతో ఎన్నో అనర్థాలు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నేతలు శ్రీహరి, వసంత, ఝాన్సీ, రాణి, సిద్ధు, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం. ధర్మనపడాల్ పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

ముంచంగిపుట్టు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా మండల పరిధిలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వేడికి తాళలేకజనాలు విలవిలవిల్లాడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ విజృంభించింది. దీంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నిత్యం రద్దీగా ఉండే స్థానిక మెయిన్ రోడ్డు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే ఎండ ఈస్థాయిలో ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి గ్రామాలను నుంచి ప్రజలు వస్తుంటారు. ఈ స్థితిలో ప్రధాన జంక్షన్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కాఫీ ప్రోత్సాహక నిధులు రూ. 50 వేలకు పెంచాలి


మాట్లాడుతున్న కాఫీ రైతు సంఘం జాతీయ నాయకుడు లక్కు

పాడేరురూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాఫీ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక నిధులు ఎకరాకు రూ. 50 వేలకు పెంచాలని గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ నాయకుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలంలోని మోదాపల్లి గ్రామంలో కాఫీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 2014 నుంచి నేటి వరకు బకాయి ఉన్న కాఫీ ప్రోత్సాహక నిధులు రూ. 60 కోట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీసీసీ, ఐటీడీఏ నిర్ధారించిన ధరకు బోనస్ వెంటనే ప్రకటించాలన్నారు. ఈ ఏడాది కాఫీకి అధిక ధర లభించినా, పంట దిగుబడి తక్కువగా ఉందన్నారు. ప్రైవేటు వ్యాపారులు(దళారులను)ను నిర్మూలనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బ్రెజిల్ లో కాఫీ దిగుబడులు పడిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీ రేటు చాలా ఎక్కువగా ఉందన్నారు. దాని వల్ల రాష్ట్రంలో కాఫీ ధర ఎన్నడూ లేని విధంగా పెరిగిందన్నారు. కాఫీ పండ్లు సేకరణలో గిరిజన రైతులకు జీసీసీ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించక ఈ ఏడాది కాఫీ రైతులు దళారుల చేతులో నష్టాలపాలయ్యారన్నారు. భవిష్యత్తులో రైతులకు అవగాహన కల్పించేలా జీసీసీ కృషి చేయాలని ఆయన కోరారు.

గంజాయి కేసులో మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సర్పంచి త్రినాథ్

ముంచంగిపుట్టు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ సెంట్రల్ జైలులో మృతి చెందిన మండలంలోని బాబుసాల పంచాయతీ డముకులాడి గ్రామానికి చెందిన జి.కేశవరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచి, గిరిజన సంఘం నేత కె.త్రినాథ్ కోరారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. అనంతరం త్రినాథ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన కేశవరావు (35)ని విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత నాలుగు నెలల క్రితం గంజాయి కేసులో అనుమానితుడిగా ఆయన ఇంటి నుంచి తీసుకువెళ్లారన్నారు. ముందస్తు సమాచారం లేకుండా జైలులో పెట్టి విచారణ పేరిట చిత్రహింసలకు లోను చేయడంతోనే అతడు మృతి చెంది ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం అతడికి బెయిల్ వచ్చినా డబ్బులు లేక తీసుకురాలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆరోగ్యం బాగోలేదని కుటుంబ సభ్యులకు కనీసం పోలీసులు సమాచారమివ్వలేదన్నారు. గురువారం మృతుని అన్న విశాఖ సెంట్రల్ జైలుకు వెళ్లి ఆరా తీయగా కేజీహెచ్‌లో కేశవరావు మృతి చెందినట్టు తెలిసిందని అన్నారు. మృతుడికి భార్యతో పాటు ఐదుగురు పిల్లలు ఉన్నారని, ఈ స్థితిలో ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని, కేశవరావు మృతిపై విచారణ చేపట్టాలని,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ సభ్యులు దళపతి, నీలకంఠం, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో కాఫీ తోటల్లో అధిక దిగుబడి

జి.మాడుగుల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాఫీ సాగులో సస్యరక్షణ పద్ధతు పాటించి అధిక దిగుబడలు సాధించాలని సబల్ ప్రాజెక్టు వాసన్ సంస్థ సీసీ జి.రాజ ప్రకాశ్ రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని ఆ సంస్థ ఆధ్వర్యంలో సింగర్భ పంచాయతీ పరిధి గ్రామాల రైతులకు కాఫీ సాగుపై పలు సూచనలు చేశారు. వేసవి కావడంతో అగ్ని ప్రమాదాల నుంచి రక్షించుకోవాడానికి అగ్గిలైన్లు ఎలా తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కె.సత్తిబాబు, కార్యదర్శి కోడ గోపి కాఫీ రైతులు పాల్గొన్నారు.

జోరుగా పుచ్చకాయల విక్రయాలు

» గిరిజనుల సాగు చేసిన పంటకు గిరాకీ

సీలేరు, మార్చి 9 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు సంతలో ఆదివారం గిరిజనులు పండించిన పుచ్చకాయలను జనాలు ఎగబడి కొనుగోలు చేశారు. సీలేరు నదీ పరీవాహక ప్రాంతాన బొడ్డగండి పంచాయతీ, మంగంపాడు, మర్రిగూడెంలకు చెందిన గిరిజనులు గత రెండు, మూడేళ్లుగా పుచ్చకాయల సాగును చేస్తున్నారు. కాయలు కోత దశకు రావడంతో ఆదివారం సీలేరు సంతలో తొలిసారిగా విక్రయాలు జరిపారు. మైదాన ప్రాంతాల నుంచి తెచ్చిన పుచ్చకాయలు సీలేరులో రూ. 70 నుంచి రూ. 100 అమ్ముతుండగా, గిరిజనులు పండించిన పుచ్చకాయలు ఒ క్కొక్కటి సైజులను బటీ రూ. 50నుంచి రూ. 30 వరకు చౌకగా విక్రయించారు. దీంతో సంతకు వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు గిరిజనులు తెచ్చిన వీటిని ఎగబడి కొనుగోలు చేశారు. మంగంపాడు నుంచి గిరిజనుడు దాసురెడ్డి తీసుకువచ్చిన పుచ్చకాయలు గంటలోనే హాట్‌కేక్‌ల్లా అమ్ముడైపోయాయి. ఇక్కడ పండించిన పుచ్చకాయలను భద్రాచలయం, మండపేట, యలమంచిలి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేశారు. అక్కడ వీటిని అమ్మకాలు జరుపుతున్నట్లు గిరిజన రైతు దాసు రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.


సీలేరు సంతలో పుచ్చకాయలు విక్రయిస్తున్న గిరిజనులు

శ్రీనివాసుని కల్యాణం చూతమురారండి

నేటి నుంచి వడ్డాదిలో వెంకన్న కల్యాణ మహోత్సవాలు

బుచ్చెయ్యపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. శ్రీనివాసుని 152వ వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి దొంగపెళ్లితో కార్యక్రమం ప్రారంభించగా, 15వ తేదీన పుష్పాంజలి సేవతో ముగిస్తారు. ప్రతి ఏటా పాల్గుణశుద్ధ వైకుంఠ ఏకాదశికి వడ్డాది గిరిజాంబ గిరిపై శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఈ ఆలయానికి ఎంతో ఘనచరిత్ర ఉంది. 153 ఏళ్ల క్రితం శ్రీనారాయణబజ్ అనే యోగి వచ్చి వడ్డాదికి దక్షిణ దిశగా వేంకటేశ్వరస్వామి నెలకొల్పబడతారని, అది పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి దేశ సంచారనిమిత్తం వెళ్లిపోయారట. ఆ మరుసటి ఏడాదే గిరిజాంబ గిరికి ఉత్తరదిశగా ఉన్న విజయరామరాజుపేట గ్రామంలో కాళ్ల వంశస్థులు బావి తవ్వుతుండగా అడుగుల లోతులో వేంకటేశ్వర



ఆలయంలో ఉత్సవమూర్తులు

స్వామి శ్రీదేవిభూదేవి విగ్రహాలు బయటపడ్డాయి. ఈ విషయాన్ని అప్పటి గ్రామ పెద్ద దొండా భగవంతులయ్యదొరకు తెలియజేయడంతో విగ్రహాలను వడ్డాది గిరిజాంబ గిరికి రప్పించి పురాణయుక్తంగా దేవాలయం నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ చేయించారు. నాటి నుంచి నేటివరకూ ప్రతి ఏటా స్వామికి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవాలయ నిర్వహణకు 60ఎకరాల మాగాని విరాళంగా ఇచ్చారు. 1970 దశకంలో ఆలయం దేవదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. ఈ స్థలానికి మహాభారతకాలంనాటి ఘటనలతో సబంధం ఉన్నట్టు సింహాచలం దేవస్థానం ప్రచురణలో పేర్కొన్నారు. మహాభారతంలో పాండవులు అజ్ఞాతవాసంలో విరాటరాజు పాలించిన మత్స్యదేశ రాజధాని అయిన విరాటపురమే నేటి వడ్డాది అని తెలుస్తోంది. పాండవులు గిరిజాంబ గిరిని ఆనుకొని ఉన్న చెరువులో స్నానం ఆచరించి సంధ్యావందనం చేసేవారని కనుకనే ఈ చెరువును పాండవుల చెరువుగా పిలుస్తున్నారని తెలుస్తుంది. ధర్మమూర్తులైన పాండవులు సంచరించిన ప్రాంతం కనుకనే వడ్డాది పరిసర గ్రామాలు సస్యశ్యామలంగా ఉన్నాయని తులతూగుతున్నాయని భక్తుల విశ్వాసం.

ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు, కార్యనిర్వహణ అధికారి టిఎస్ఎన్.శర్మ సంయుక్తంగా తెలిపారు. భక్తులు క్యూలైన్‌లో వెళ్లేందుకు భారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే వైద్య శిబిరం, తాగునీటి సరఫరా, ప్రసాద వితరణ, అన్నదానం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కొండవద్ద దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జంక్షన్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వారు చెప్పారు.

పేద కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నిరుపేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. రైవాడ అతిథి గృహంలో ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరాపల్లి మండలాన్ని నాటు కోళ్ల పెంపకం మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వమే 45 శాతం నుంచి 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. మిగతా పెట్టుబడి సొమ్మును ఆరు శాతం స్వల్ప వడ్డీపై బ్యాంకు గ్యారంటీ ఇచ్చి లబ్ధిదారునికి సమకూరుస్తుందన్నారు. ప్రభుత్వ ఆర్థికసాయంతో పెంచిన నాటుకోళ్లను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి ప్రభుత్వం సహకారం ఉంటుందన్నారు. కె.కోటపాడు మండలాన్ని ఉద్యానవన హబ్‌గా తయారు చేయాలని సంకల్పించామన్నారు. ఈ మండలంలో కూరగాయల సాగు, పువ్వుల పెంపకాలను ప్రోత్సహిస్తామన్నారు. పదో తరగతి, ఆపై విద్యను అభ్యసించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ప్రతీ మండలంలో రెండు పంచాయతీలను గుర్తించి సేంద్రియ వ్యవసాయం ద్వారా పంటలు పండించే రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే డ్రిప్ ద్వారా రైవాడ జలాశయం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మైదాన ప్రాంత గిరిజనులను ఐటీడీఏలో విలీనం చేసే అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని ఎమ్మెల్యే బండారు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు దంపతులు

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయమూర్తి దంపతులు పాల్గొన్నారు. మారేపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, పెదనందిపల్లి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, దేవరాపల్లి మోడల్ కాలనీలో నిర్మించిన నూకాంబికా ఆయలంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో వారు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయం చైర్మన్ పి.పాత్రినాయుడు, నాయకులు పి.వెంకటరమణ, జగన్నాథం, నాగేశ్వరావు, దేముడునాయుడు, సూర్యనారాయణ, రమాదేవి, నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీపై కూటమి పభుత్వం నిర్లక్ష్యం

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే గోవాడ షుగర్స్ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి, వైసీపీ చోడ వరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. సీతయ్యపేట గ్రామంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫ్యాక్టరీకి రూ.89.9 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యాక్టరీకి కనీసం ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదన్నారు. క్రషింగ్ ప్రారంభించిన కొద్ది కాలంలోనే 13 సార్లు అంతరాయం ఏర్పడి నిలిచిపోయిందన్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో రైతులకు ఆధారమైన గోవాడ షుగర్స్‌ను గాడిలో పెట్టాలన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

ఫ్యాక్టరీ వద్ద రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, నాయకులు వి.బాబూరావు, వై.వాసు, ఎస్.లక్ష్మీరావు, కె.అప్పలనాయుడు, సర్పంచులు గోపిశెట్టి శ్రీనివాసరావు, గొలజాన శ్రీను, జి.వరకృష్ణ, ఇందలి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతుల సమస్యలపై సోమవారం ధర్నా నిర్వహించనున్నట్టు వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేశ్, సీనియర్ నేత ఏడువాక సత్యారావులు చెప్పారు. ఫ్యాక్టరీపై ప్రభుత్వ నిర్వాకంతో రైతుల ఇబ్బందులు తెలుసుకునేందుకు, ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టేందుకు సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో పాటు వైసీపీ అధ్యక్షుడు జిల్లా బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి అమర్, ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ హాజరవుతున్నారని, రైతులు విజయవంతం చేయాలని కోరారు.

చురుగ్గా గొలుగొండ-నాతవరం రోడ్డు నిర్మాణం

గొలుగొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ-నాతవరం మండలాలకు లింకు రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని 2018లో సుమారు రూ.2 కోట్లతో తాండవ రిజర్వాయర్ అంచు నుంచి తారురోడ్డు పనులు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ రోడ్డులో పొగచెట్లపాలెం నుంచి సాలికమల్లవరం గ్రామం వరకూ రిజర్వుఫారెస్ట్‌లో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అయితే 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో వాహన చోదకులు, ప్రజలు రాకపోకలకు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తక్షణమే నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఇక్కడి ప్రజలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉపాధి పథకంలో రూ.80 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో నెల రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో నాతవరం మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గొలుగొండ-నాతవరం మార్గంలో నిర్మిస్తున్న లింకు రోడ్డు

ఏఎల్ పురంలో రూ.30 లక్షలతో శ్మశానవాటిక



ఏఎల్ పురంలో నిర్మిస్తున్న శ్మశానవాటిక, రోడ్డు

కృష్ణాదేవిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో రూ.30 లక్షలతో శ్మశానవాటి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి ఆరేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం స్మశాన వాటికలో రెండు భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఎండకు, వానకు మృతులు బంధువులను సేద తీర్చుకునేందుకు ఒక భవనం, మరో భవనం మృతదేహాలను కట్టెలతో కాల్చేందుకు నిర్మించారు. అప్పటి నుంచి ఈ శ్మశానన వాటికను ఎవరూ పట్టించుకుకోవడంతో సరైన రహదారి సౌకర్యం లేక ఇరువైపులా కుప్పలు పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. వర్షాలు పడితే బురదతో మరింత అధ్వానంగా మారేది. ఈ సమస్యపై రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యులు చిటికెల తారకవేణుగోపాల్ తీసుకువెళ్లగా, రూ.30 లక్షలు నిధులు కేటాయించారు. దీంతో ప్రస్తుతం సుమారు 300 మీటర్లు సీసీ రోడ్డు ఇరువైపులా డ్రైనేజీతో పాటు ముఖద్వారం వద్ద బారీ కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో ఐఐటీ, జేఈఈ శిక్షణ కేంద్రం



కరపత్రాలు విడుదల చేస్తున్న డేవిడ్, విద్యావేత్తలు

చోడవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఐఐటీ, జేఈఈ మెయిన్స్ శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. స్థానిక గాయత్రీ జూనియర్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, ప్రముఖ విద్యావేత్తలు వాసు, వరహామూర్తి తదితరులు ఈ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గాయత్రీ విద్యాసంస్థల ఛైర్మన్ జి.పెద్దినాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇప్పటివరకు ఐఐటీ, జేఈఈ మెయిన్స్ శిక్షణ కేంద్రం లేకపోవడంతో చాలా మంది నగరాలకు వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని స్థానికంగా నిపుణులైన విద్యావేత్తలతో ఐఐటీ, జేఈఈ మెయిన్స్ శిక్షణ కేంద్రం ప్రారంభించామన్నారు. ఈ శిక్షణ పొందగోరే విద్యార్థులు 9247479904, 9291305400 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు ఈశ్వరరావు, చిరు, ప్రభాకర్, రామకృష్ణ, సత్యనారాయణ, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల బకాయిల విడుదలకు కృషి చేయాలి

▸▸ ఎమ్మెల్సీ గాదెకు సంఘం జిల్లా కోశాధికారి వినతి

చోడవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ గాదెశ్రీనివాసులునాయుడుకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి జి.సింహాద్రప్పడు విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడును కలిసిన ఆయన, ప్రభుత్వ పరంగా సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు విడుదలయ్యేలా చూడాలని విన్నవించారు.



ఎమ్మెల్సీ గాదెను కలిసిన సింహాద్రప్పడు

ఇసుక అక్రమార్కులపై చర్యలు తప్పవు

▸▸ ర్యాంపునకు అడ్డుగా గొయ్యిలు: 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



ఇసుక ర్యాంపునకు వెళ్లే మార్గంలో గొయ్యిలు తవ్వుతున్న అధికారులు

మాకవరపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ లోకవరపు రామారావు హెచ్చరించారు. జంగాలపల్లిలోని ప్రభుత్వ భూమిలో ఇసుక యథేచ్ఛగా తరలిస్తున్నారని 'ఇసుక తోడేళ్లు' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించి విషయం తెలిసిందే. దీనిపై తహసీల్దార్ స్పందించారు. ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వకాలను తనిఖీ చేశారు. భారీ స్థాయిలో ఇసుక తవ్వకాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని రెవెన్యూ సిబ్బందిపై అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తవ్వకాలపై వెంటనే పూర్తి నివేదిక ఇవ్వాలని వీఆర్వోను ఆదేశించారు. ఇసుక ర్యాంపునకు వాహనాలు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్‌తో అడ్డంగా గొయ్యిలు తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశించినట్టు చెప్పారు.

పిఠాపురం జనసేన సభకు తరలిరండి

▸▸ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

బుచ్చెయ్యపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలో వడ్డాది గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు అధ్యక్షత ఆదివారం జనసేన శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న పిఠాపురంలో సభ జరుగుతుందని, అందరూ తరలిరావాలని కోరారు. పార్టీ ఇన్‌చార్జి రాజు మాట్లాడుతూ జనసేన సభ పండగ వాతావరణంలో జరగబోతుందని, రాష్ట్ర చరిత్రలో గుర్తుండేలా సభ నిర్వహిస్తామని చెప్పారు. పదవులతో సంబంధం లేకుండా పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మాడుగుల, నర్సీపట్నం ఇన్‌చార్జిలు రాయపురెడ్డి కృష్ణ, రాజాన వీరసూర్యచంద్ర, నాయకులు అడపా నర్సింహమూర్తి, కర్రి తమ్ముNనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకొండలరావు



మాడుగుల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం గ్రామానికి చెందిన రాపేటి రామకొండలరావు (మాస్టారు) విశ్వహిందూ పరిషత్ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం సమీపంలోని వీరంపాలెం గ్రామంలో బాలత్రిపుర సుందరి సహిత, పరమేశ్వరుని దేవాలయంలో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర సమావేశంలో ఆయను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకొండలరావు మాట్లాడుతూ వీహెచ్‌పీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని చెప్పారు. పలువురు అభినందనలు ఆయన్ను అభినందించారు.

సీఆర్‌పీలకు హెచ్‌ఆర్ పాలసీ తీసుకొస్తాం

▸▸ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు వెల్లడి

▸▸ అనకాపల్లిలో జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల స్థాయిలో కీలక విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ (సీఆర్‌పీ)లకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని సీఆర్‌పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఇక్కడ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీ సహా పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి.

ఎన్నికైన సంఘం కార్యవర్గం

సంఘం జిల్లా గౌరవాధ్యక్షునిగా శ్యామ్ (రావికమతం), జిల్లా అధ్యక్షునిగా సబ్బవరపు శంకరరావు (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి (రోలుగుంట), కోశాధికారిగా మూర్తి (రాంబిల్లి), ఉపాధ్యక్షులుగా రామకృష్ణ (గొలుగొండ), కన్వీనర్‌గా రమణ (సబ్బవరం), కో-కన్వీనర్‌గా పి.గంగాధర్ (దేవరాపల్లి), మహిళా కార్యదర్శిగా పద్మజ (అనకాపల్లి), కమిటీ సభ్యులుగా సతీష్ (రోలుగుంట), శ్రీనివాస రెడ్డి (ఎలమంచిలి), శివప్రసాద్ (అచ్యుతాపురం), గోవింద్ (మునగపాక), టి.శ్రీనివాసరావు (బుచ్చెయ్యపేట), చిరంజీవి (ఎస్.రాయవరం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణం చేయించామన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

వైభవంగా నూకాంబిక సంబరం

▸▸ ఘటాలు, అమ్మవారి సారెతో భక్తుల భారీ ఊరేగింపు

రావికమతం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ కొత్తకోట గ్రామంలో నూకాంబిక అమ్మవారి సంబరం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయం ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆదివారం సంబరాన్ని నిర్వహించారు. ఊరూవాడ ఏకమై ఇంటికో ఘటంతో, డప్పుల వాయిద్యాలతో వేలాదిగా మహిళలు, యువకులు ఊరేగింపుగా తరలివెళ్లారు. ఊరేగింపును చూసేందుకు జనాలు పోటెత్తారు. దీంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. దాదాపు 300 మందితో సారె, ఘటాలతో గ్రామ పురవీధులలో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధనను ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నాయకులు కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు. కాగా, సంబరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కొత్తకోట పోలీసులు తగిన చర్యలు చేపట్టారు.

నల్లగొండమ్మతల్లి వార్షికోత్సవం

నాతవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ గ్రామంలో నల్లగొండమ్మతల్లి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. పసుపు కుంకుమ సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ప్రతీ ఇంట్లో మహిళలు బూరెలు, పిండి వంటకాలు తయారు చేసి, ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. వీటిని అన్న సంతర్పణలో భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుర్ల వెంకటరమణ, టీడీపీ నాయకుడు చింతకాయల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కందిపూడిలో ఆలయ ప్రారంభోత్సవం

బుచ్చెయ్యపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందిపూడి గ్రామంలో శ్రీభూలోకమాంబ ఆలయాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు దొండా నరేశ్, గణేశ్, డొంకిన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై చర్చ

చోడవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి, రైతుల సమస్యలపై చర్చించేందుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం గోవాడ వస్తున్నట్టు జిల్లా సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న తెలిపారు. ఫ్యాక్టరీ పరిశీలనతో పాటు చెరకు రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెరకు రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి పెద్దింటమ్మ జాతర

రోలుగుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కుసర్లపూడి గ్రామంలో సోమవారం నుంచి పెద్దింటమ్మ జాతర నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే రాజు ఆవిష్కరించారు. ఈ నెల 14న జాతర మహోత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఆ రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే ప్రతీ రోజు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

చీడికాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తురువోలు గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులు పలువురు ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన కంచి రాము, చొక్కాకుల భగవంతులు కుటుంబాలను పలువురు ఉద్యోగులు రూ.70 వేలు సమీకరించి రూ.35 వేలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బీశ్ల కోటేశ్వరరావు, గ్రామ పెద్ద పి.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు వెండి వితరణ

మాడుగుల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మకు దాతలు పావు కిలో వెండిని వితరణగా అందించారు. గ్రామానికి చెందిన పాతాల కొండాజీ పావు కిలో వెండిని సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ సంజీవరావుకు అందించారు.

సారా నియంత్రణకు నవోదయం

మాడుగుల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొప్పులపాలెం, కొండలపాడు గ్రామాల్లో నాటుసారా నియంత్రణకు ఆదివారం నవోదయం-2 కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్ గ్రామ సభ నిర్వహించి కళాజాత ద్వారా సారా అనర్థాలపై అవగాహన కల్పించారు. సారా తయారీ, అమ్మకం నేరమని చెప్పారు. నాటుసారా సంబంధిత ఫిర్యాదులకు 14405 టోల్‌ఫ్రీ నంబరుకు తెలపాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా కిట్లు

దేవరాపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పెదనందిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లను ఆదివారం అందించారు. ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీను, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.